భోగిపండుగ

వజ్ఝల వేంకటేశ్వరకవిగారు, బి. ఏ.

అది పుష్యమాసం. దరిద్రులపాలిటి భాగ్యదేవత వలె పగలంతా ప్రకాశించిన సూర్యుడు మెల్లమెల్లగా అస్తమిస్తున్నాడు; భయంకరమైన చలీ, అంధకారం, క్రమక్రమంగా ప్రపంచాన్ని ఆవరించ మొదలుపెట్టాయి. ఒకొక్కళ్లే యిళ్లకు చేరుకుంటున్నారు ప్రజలు. చలిబాధనుంచి తప్పించుకోడానికి దుస్తులు లేని బీదవాళ్లవలె ఆకులురాల్చిన మోడుమానులు సాధారణంగా కనిపిస్తున్నాయి. అక్కడక్కడ, హాయిగా వెచ్చగా పరిపూర్ణశరీరాచ్ఛాదనచే చలిబాధఅంటే తెలీకుండా సుఖించే ధనవంతుని రీతిగా ఒకొక్క చెట్టుమాత్రం పండబారిన ఆకులతో నిండుగా ఉన్నాది. భగవంతుడు సృష్టించిన ప్రాణులలో మనుష్యజాతి తప్ప తక్కినవన్నీ స్వతస్సిద్ధమైన రక్షణోపాయములచే ఆ చలిబాధలేకుండా సుఖంగా ఉన్నాయి. మనుష్యులలో మాత్రం అందుకు విపరీతంగా, ధనవంతులు అన్యజీవప్రసాదితములైన కంబళ్లను కప్పుకొని సుఖమనుభవిస్తున్నారు; బీదవాళ్లు మాత్రం చలిబాధనుండి తమ్ము తాము రక్షించుకోలేక కష్టమనుభవిస్తున్నారు.

అదొక పూరిల్లు. ఒకవసారాలో కుంపటినిండా నిప్పులుపోసుకుని దానిచుట్టూ నలుగు రాడపిల్లలు పోగై చలికి తాళలేక కాచుకుంటున్నారు

'అబ్బా చలీ. ఆటుంటాపదవే బుచ్చక్కయ్యా!' అన్నాది మధుర కొంచెం ముందుకి జరుగుతూ.

"అయితే వుండు మరి తోశేస్తావేమిటి? నాకు మాత్రం చలికాదూ?" అని విసుక్కుంటూ కొంచెం జాగాయిచ్చింది శశిరేఖ.

"ఉండేశశీ! అస్తమానం నువ్వేనా? చేతులు తియ్యి, నాకుయేమిసెగ తగల్లేదు." అని సరోజ శశిరేఖచేతులు తీసివేసింది.

"మాడే పెద్దక్కయ్యా! చిన్నక్కయ్య నన్ను కాచుకోనియ్యకుండా ఉంది?" అంది శశిరేఖ

"రోజా! నువ్వేనా ఊరుకుందూ? యిలామనం దెబ్బలాడుకోవచ్చునా? మనం అందరం కాచుకోవాలి. మధూ! నువ్విలాగా, నాదగ్గిర కూచుందూ గాని." అని సుభద్ర వాళ్లతగువు తీర్చింది.

"అయితే పెద్దక్కయ్యా, రేపేకదే భోగీ? మాకు మూడ్రోజులు శలవుకూడానూ!" అంది మధుర.

దానిమీద శశిరేఖ అందుకున్నాది "మరి భోగికి మనకి కొత్తబట్టలు ఇస్తుందికదే అమ్మ? అవును, నేను అడిగితే మొన్న అలాగే అంది."

"కొత్తబట్టలూ, పండుగడబ్బులూ లేంది పండుగేమిటి?" అని విసుక్కుంటూ సరోజ తన వుద్దేశం కూడా చెప్పింది.

అప్పుడు సుభద్ర కొంచెం ఆలోచించి నెమ్మదిగా అంది, "మనం మరి బీదవాళ్లం. మనకి కొత్త బట్టలురావడం యెలాగ?" అని తన పాతచీరవేపు చూసుకుంది.

"అయితే మరి అమ్మ అందరికీ బట్టలు కుట్టి యిస్తుంది. మనకికూడా కుట్టదూ? ఆఁ, యిస్తుంది నాకుతెలుసును. నిన్నకుట్టింది చూశానులే," అని మధుర ఆశామయ హృదయంతో అన్నాది.

"మధూ! అవి మనవికావు. ప్లీడరుగారి పిల్లలవి. వాళ్లు కుట్టినందుకు డబ్బులు యిస్తారు."

"అయితే పెద్దక్కయ్యా? మరి రోజా అమ్మా, నువ్వూ, చిన్నక్కా, నూలుతీస్తున్నారుకదా, అది

సేయించి మనకి కుట్టకూడదూ ?" అని శశిరేఖ అంది.

"శశీ! మనం బీదవాళ్లం. అది అమ్మకొని వచ్చే లాభంతో కాలక్షేపం చెయ్యడానికి బియ్యం అవీ కొనుక్కోవద్దూ? మళ్లీ దూదికొని నూలు వడుకుతూ ఉండాలి. బట్టలు కుట్టించుకుంటే యెలాగ?"

"అయితే కొందరుపిల్లలు మంచిమంచి బట్టలు కట్టుకోవడం, బంగారపు నగలు పెట్టుకోవడం, మనలాటి వాళ్లకి యేమీ లేకపోవడం యేమిటో ?" అని వయసుకుమించిన ఆలోచనలో మునిగింది మధుర.

"పోనీ, మనకవన్నీ లేకపోతేనేమి? అమ్మా, నాన్నా ఉన్నారుకదూ? ఒకళ్లకొకళ్లం మనం ఉన్నాంకదూ? మనకింకేం కావాలి?" అని సంతృప్తికరమైన జవాబు శశిరేఖ యిచ్చింది.

ఆ జవాబుతో అనలుగురి హృదయాలలో ప్రేమ ఒక్కమారుగా ఉప్పొంగింది. ఆకుంపటి నిప్పులకాంతిలో వాళ్ల ముఖాలపై ఆనందవికాసం ప్రస్ఫురించింది. కాని యింతలోనే శశిరేఖ, "అమ్మఉన్నాది కాని నాన్న యేడీ? మళ్లీ యెప్పుడు చూస్తామో కదా మననాన్నని!" అని అనగానే ఆముఖాలలో ఒకమారు విషాదచ్ఛాయలు అలవరించేయి.

పాపం నాన్న! అతడు సహాయ నిరాకరణోద్యమంలో, విదేశవస్త్ర బహిష్కార ప్రచారంలో, పనిచేసి స్వార్థత్యాగియై, దేశసేవా పరతంత్రుడై చివరకి ఖైదులో పడినాడు. అతన్ని జ్ఞాపకం తెచ్చుకుని ఆ పిల్లలు నలుగురూ రెండునిముషాలు మాట్లాడలేక పోయేరు. చివరకి సుభద్రనెమ్మదిగా అన్నాది,

"ఈ యేడాది మనకి పండుక్కి కావలసినవన్నీ యెలావొస్తాయి అంది అమ్మ. నాన్న జైల్లో కష్టపడుతూవుంటే మనకి పండుగ సరదాలు తీరడం యెలాగ?"

"అయితే పెద్దక్కయ్యా! మళ్లీ నాన్న యెప్పుడు వస్తాడే? మరి ఈ యేడాది నాన్నకి అక్కడపండుగ వుండదుటే?" అని మధుర అడిగింది.

"నాన్న ఉంటే ఎంతబాగుండును! నిరుడు అమ్మనాన్నా, అందరం పండుగ చేసుకున్నాం కొత్తబట్టలు కట్టుకున్నాం. పెద్దక్కా! మళ్లీపండుక్కైనా నాన్నరాడుటే?" అని ఆత్రుతతో శశిరేఖ కూడా అడిగింది.

"శశీ! నాన్నవొస్తాడులే! అదృష్టంబాగుంటే మళ్లీ భోగికి అందరం కలిసి హాయిగా పండుగ చేసుకుటాం." అని సుభద్ర సమాధానం చెప్పి శశిరేఖను మధురను సంతోషపెట్టింది.

"అయితే మనకి రేపు పండుగలేదూ?" అని సరోజ ప్రశ్నించింది.

"లేకేమి? ఉంది. అమ్మ మనందరికీ తెల్లవారగట్లే నీళ్లుపోస్తుంది. మనకేమేనా పిండివంట చేసి పెడుతుంది. మనమందరం కలిసి సరదాగా ఆడుకుంటాము."

అని సుభద్ర చెల్లెళ్లకు సంతోషం కలిగించింది. ఆక్షణం సుభద్రహృదయంలో ఒకానొక సంచలనం కలిగింది. పూర్వస్మృతులు ఆమె భావాన్ని కలగించేయి. తనకు చాలా బాల్యమందే పెళ్లికావడం, పండుక్కి తన భర్తరావడం, మొదలైన మధుర మధుర భావాలు ఆమె మనసులో స్వప్నములవలె మెరుపులవలె గోచరించినవి. ఇప్పుడామె వితంతువు, జ్ఞానవతి. ఆ మాధుర్యము అప్పుడే నశించింది. ఆ బాలిక తన దుస్థితి గ్రహించింది; తన జీవితంలో ఇక మాధుర్యం లేదనుకుంది. ఆమె నేత్రాల్లోంచి రెండు పెద్ద అశ్రుబిందువులు బహిర్గమించేయి కాని శశిరేఖా మధురలు గ్రహించలేదు. సరోజ గ్రహించి ఉంటుంది. సుభద్ర కన్నీళ్ళుతుడిచివేసి మనో వైకల్యం

కప్పిపుచ్చి కొంతసేపు నీరవంగా ఊరుకుంది. సరోజ ప్రసంగాన్ని సాగించింది.

"మధూ! నువ్వు తెల్లారకుండా చలిలో లేస్తావా?"

"ఏమీ, నేనుమాత్రం నీళ్లుపోసుకోననుకున్నావా యేమిటి? తెలివిరాకపోతే అమ్మ లేపుతుంది. లేకపోతే పెద్దక్కయ్య. ఏమే పెద్దక్కయ్యా?"

"లేపుతాను లే మధూ!"

"మరి మనం భోగిమంటవేసి కాచుకుంటాం కదూ?" అని శశిరేఖ అంది.

"అలాగేకాని అక్కయ్యా! మరి మనకి కొనుక్కోడానికి అమ్మ డబ్బులివ్వదూ?" అని సరోజ శశిరేఖ మాటకి జవాబురాకుండానే సుభద్రని అడిగింది.

"రోజా! పెద్దదానివి కదా నువ్వుకూడా డబ్బులడగడమేనా? అమ్మ కష్టపడి నూలువడికి బట్టలు కుట్టి తెచ్చినడబ్బు మనతిండికి చాలడమే కష్టం." అని సుభద్ర సమాధానం చెప్పింది.

"అయితే నేనుమాత్రం కష్టపళ్ళేదూ? బడికి వెళ్ళేటప్పుడు నా బట్టలు చింకివనీ, నాకు సరుకులు లేవనీ, నన్ను పిల్లలు ఉడికిస్తూవుంటే నాకెంత కష్టంగావుంటుంది. ఏమే బుచ్చక్కయ్యా! మనం మాత్రం కష్టపడలేదుటే?" అని మధుర అంది:

ఆమాటలకి సరోజ నవ్వింది. అందరూ నవ్వేరు. అప్పుడు సుభద్ర అంది,

"మనం బీదవాళ్లం అవడంచేత కదా మనకీ కష్టాలు. మన నాన్నకి మునపట్లాగే ఉద్యోగం పోకుండా లావుగా డబ్బుంటేనే, యెంత బావుండును!"

"అయితే పెద్దక్కయ్యా! మరి నువ్వావాళ మనం రాజుగారి పిల్లలకంటే సుఖంగా ఉన్నాం అన్నావు కదూ? వాళ్లకి డబ్బున్నా సుఖం లేదన్నావు కదూ?"

"అవునే మధూ! అలాగేనే! మన పనులు మనం చేసుకుంటాం. కులాసాగా ఆడుకుంటాం. మనకి కాకపోతే మరెవళ్ళకి సుఖం?"

ఈవిధంగా నలుగురూ మర్నాటి పండుగను గురించి ముచ్చటించుకుంటున్నారు కుంపటికాచుకుంటూ. సుభద్రకో పదిహేనూ, సరోజకి పన్నెండూ, శశికి పదీ, మధురకు ఎనిమిదేళ్లూ వయస్సు. వాళ్ల తండ్రి జైలుకుపోయి యింకా సంవత్సరం కాలేదు. రెండు సంవత్సరాలు కఠినశిక్ష అనుభవించవలసి ఉంది. మొదట్లో అతడు గవర్నమెంటులో నెలకు వందరూపాయల జీతంమీద ఉద్యోగంచేస్తూవుండేవాడు. ఆరోజుల్లో కుటుంబం సుఖంగా కాలక్షేపం చేస్తూవుండేది. కాని అనంతరం అతడు దేశసేవాపరతంత్రుడయ్యేడు. ఉద్యోగంపోయింది. అయినా లక్ష్యపెట్టలేదు. అతడు ఉద్యోగముచేసే రోజుల్లో అతని తల్లి ఉండేది. ఆమె ప్రోద్బలంవల్ల అతడు సుభద్రకు బాల్యంలో పెళ్లిచేసేడు. పెళ్లి చేసిన రెండు సంవత్సరాల్లో తల్లీ, అల్లుడూ, క్రమంగా చనిపోవడం తటస్థించింది. అది మొదలు అతని హృదయంలో పరివర్తనం కలిగి సాంఘిక దురాచారములవంకనూ, దేశదారిద్ర్యాదులవంకనూ అతని దృష్టి మరలింది. ఇప్పటివరకూ రెండవ కుమార్తెకు పెళ్లిచేయలేదు. అతడు స్వార్థత్యాగియై దేశహితార్థియై కార్యరంగంలో ప్రవేశించినాడు. అది మొదలు అతనికీ, అతని కుటుంబానికీ కష్టాలు ప్రారంభం. ఇప్పుడు అతని భార్య నూలు వడకడం, బట్టలు కుట్టడం మొదలైన వృత్తులవల్ల కుటుంబపోషణ జరిగిస్తూ భర్త రాకకోసం నిరీక్షిస్తున్నాది. సుభద్ర, తల్లికి సంసారవిషయంలో సహాయం చేస్తున్నాది. సరోజ గృహకృత్యాలలో తోడ్పడుతూ,

ఇంటిదగ్గిరే చదువూ మొదలైనవి నేర్చుకుంటున్నాది. శశిరేఖా, మధురా, బడికి వెళుతున్నారు.

ఆనాటి సాయంకాలం చీకటిపడుతూవుంటే బాలికలు మాట్లాడుకుంటూవుండగా, లక్ష్మిదేవి వాళ్ల అమ్మ వంటింట్లో వండుతున్నాది. సుభద్ర లేచి బుడ్డీదీపం వెలిగించింది. ఇంతట్లోకి పోష్టు జవాను ఉత్తరంఅంటూ గుమ్మంలోపడవేసి వెళ్లిపోయేడు. 'ఉత్తరం! ఉత్తరం!' అంటూ ఆత్రుతతో నలుగురూ వీధిగడపలోకి పరుగెత్తేరు. సుభద్ర ఉత్తరంతీసి ఎడ్రసు చదువుతూంది. "నే చూస్తానియ్యవే" అంటూ సరోజా, శశిలేఖా, మధురా గంతులువెయ్యడం మొదలుపెట్టేరు. ఇంతట్లో వంట ముగించి లక్ష్మి పైకివచ్చి "ఏమిటా అల్లరి?" అని కేకవేసింది.

"అమ్మా చూడే! ఉత్తరంవస్తే పెద్దక్కయ్య చూపించకుండావుందే!" అని మధుర ఫిర్యాదు చేసింది.

"పోనీ, నే చూపిస్తానులే, ఉండు" అని లక్ష్మిదేవి ముందుకు నడిచింది. అందరు గదిలోకి చేరుకున్నారు.

"ఏదీ సుభద్రా! ఉత్తరం యిలాతే!" అని ఉత్తరం తీసుకుని లక్ష్మి కూర్చుంది. చుట్టూ నలుగురూ మూగేరు. అందరికీ ఉత్తరం చదవడమంటే సరదా! అందరూ చూస్తూవుండగా దీపపువెలుగులో లక్ష్మి చదివింది. నాన్నదగ్గిరనుండి అని తెలియగానే ఆ పిల్లల ఆనందానికి మేరలేకపోయింది.

ఆ ఉత్తరంలో అతడు తా ననుభవిస్తూన్న కష్టాలనుగురించీ, చెరసాల యిబ్బందులనుగురించీ వ్రాయనేలేదు. తనకు సుఖంగానే కాలంగడుస్తున్నాదని వ్రాసేడు. భార్యనూ, పిల్లలనూ, చూడడానికి తన కున్న కోరికను తెలియజేసినాడు. కష్టాలకు భయపడవద్దనీ, కష్టాలలో భగవంతుడు కాపాడగలడనీ, పరోపకారదీక్ష మానవద్దనీ, తల్లి చెప్పినట్లు పిల్లలు బుద్ధిగా నడుచుకోవలసిందనీ, వాళ్లపనులు వాళ్లు చక్కగా నిర్వర్తించుకోవలసిందనీ, భోగినాడు పండుగ చేసుకోవలసిందనీ, ప్రేమపూరితమయిన తన హృదయమును వ్యక్తపరుస్తూ అతడు ఉత్తరమును పూర్తిచేసేడు. చదువుతున్న కొద్దీ తల్లికంఠం రుద్ధమైంది. ఆమె, పిల్లలూ కొంతసేపు మాటాడలేకపోయేరు. ధీరురాలైన లక్ష్మిదేవి హృదయంలోనే దుఃఖాశ్రువులు ఉద్భవించి శాంతించేయి. తుదకు ఆమె అంది:

"చూశారా? నాన్నగారు ఎలారాశేరో? మీరందరూ బుద్ధిగాఉంటే మన కెప్పుడూ కష్టాలుండవు. సుఖంగా ఉంటాము."

"మరైతే, అమ్మా, మేము నువ్వు చెప్పినట్లుగు వింటున్నాం కాదే?" అని శశిరేఖ అంది.

"అమ్మా! యిప్పుడు మనం సుఖంగా ఉన్నాం కదూ? నాన్న మళ్లీ వచ్చేస్తారు కదూ?" అని మధుర అంది.

"లేకేం చిట్టితల్లీ! సుఖంగానే ఉన్నాం. మళ్లీ నాన్నగారు వచ్చి మీరందరూ ఇంకా బాగాచదువుకొని మంచిపనులు చేస్తూవుంటే సంతోషిస్తారు."

"అలాగే ఉంటాం, అమ్మా!" అని శశి అన్నాది.

"ఇంక లెండి, రాత్రి అయిపోయింది. అన్నం పెడతాను రండి!"

అందరూ భోజనానికి లేచేర్లు.

* * * *

తెల్లవారుతూంది. పక్షులు కలకలమని అరుస్తున్నాయి. ఇంకా చీకటిఉంది. సుభద్రా, లక్ష్మిదేవీ ముందుగా లేచేరు. వాళ్లతో మధురకికూడా తెలివివచ్చింది. మధుర వెళ్లి సరోజను శశినీకూడా

తేసేసింది. అందరూ మేల్కొని పెరట్లోకి వెడ్తేరారు. పాపం ఆ పిల్లల్ని చలి గజగజ వణికించేస్తున్నాది. కప్పుకోడానికి మంచి పచ్చడాలు లేవు. అయినా ఉత్సాహవశంచేత వాళ్లు ఆచలిని లక్ష్య పెట్టలేదు. లక్ష్మి నీళ్లపొయ్యిమీద నీళ్లు కాగ బెడుతూవుంటే బాలికలు ఒకచోట భోగిమంట వేసేరు; వెచ్చగా కాచుకుంటున్నారు. లక్ష్మిపిల్లల్ని నీళ్లపోతకు రమ్మంది.

"రోజా! రా అమ్మా నీకు ముందు పోస్తాను."

"అమ్మా ఉండే, చలేస్తున్నాది. అందాకా శశికి పొయ్యవే?"

"శశీ! పోనీ నువ్వురా ముందు. ముందుపోసుకున్నవాళ్ళు ముత్యాలగొడుగులు!"

"వెనకపోసుకున్నవాళ్ళు వెండిగొడుగులు!" అని సుభద్ర అంది.

"అమ్మా! నే ముందువస్తానే!" అని మధుర లేచింది. సుభద్ర పుల్లపోసింది. లక్ష్మి రుద్దింది. మధుర, శశిరేఖ, సరోజ క్రమంగా నీళ్ళుపోసుకున్నారు. తరవాత సుభద్రా, ఆఖర్ని లక్ష్మికూడా పోసుకున్నారు. లక్ష్మిదేవి పిల్లలందరికీ చద్దిఅన్నం పెట్టింది. అన్నం తిన్నాక కొత్తబట్టలు లేవు కదా అని సరోజ, శశి, మధుర కొంచెం నిరుత్సాహంగా ఉండగా లక్ష్మి యింట్లోంచి మూడు పరికిణీలూ, మూడు జాకెట్లూ, కొత్తవి, ఖద్దరువి పట్టుకొచ్చింది. వాళ్ల మొగాలు పూర్తిగా వికసించి ఆశ్చర్యం కనబర్చేయి.

"అమ్మా! యెక్కడివే, ఎప్పుడు కుట్టేవే?" అని మధుర.

"అమ్మా, యేవీ కొత్తవేనే! మరి పెద్దక్కయ్య లేవన్నాదీ, యెలాగొచ్చేయే?" అని శశిరేఖ.

"అయితే అమ్మా ఈవాళ భోగికి నువ్వు చెప్పకుండా బట్టలుకుట్టి దాచేవుటే?" అని సరోజ.

"పిల్లలారా! మీకోసమే కుట్టివుంచేను" అంటూ లక్ష్మి పసుపుబొట్లుపెట్టి ముగ్గురికీ కొత్తబట్టలు తొడిగించింది. అవి చూచుకుని వాళ్ళు ఆకాశం అందుకున్నారు. పాపం, సుభద్రకు కొత్తచీర లేకపోయింది, ఆమె వాంఛించనూలేదు. లక్ష్మిసుభద్రలు ఇంట్లో పనులు సవరించుకొంటూవుండగా, రోజా, శశీ, మధూ, వీధిగడపన్నాదికి వెళ్ళి కూర్చున్నారు. అప్పటికి బాగా యెండవచ్చింది. వీధి కలకలలాడుతూ జనంతో నిండి ఉత్సాహవంతంగా ఉన్నాది.

భోగిపండుగ అంటే ముష్టిపండుగ అని కూడా అనడంకద్దు. ఆరోజున మనదేశంలో ప్రతివీధిలోనూ ముష్టివాళ్ళు అపరిమితంగా కనిపిస్తారు అదివరకు ముష్టెత్తని వాళ్ళుకూడా కొందరు ఆరోజున భిక్షుకులౌతారు. దేశంయొక్క దారిద్ర్యం అంతా ఆనాటి భిక్షార్థుల దీనదృష్టులలో ప్రతిఫలిస్తుంది. ప్రతివీధిలోనూ పరస్పర విరుద్ధాలైన రెండు దృశ్యాలు: కటికిదరిద్రుని కడుపుమంట, స్వార్థపరుండైన ధనవంతుని యైశ్వర్యపు మత్తత!

తల్లియిచ్చిన బుట్టలో బియ్యంపోసి పెట్టుకొని మన బాలికలు కూర్చున్నారు పిడికెడేసి బియ్యం వెయ్యడానికని. కుటుంబాలతోసహా వొస్తూన్న ఆ ముష్టివాళ్ళని చూస్తే వాళ్ళకి జాలికలిగింది. అప్పుడు మధుర అంది.

"చిన్నక్కయ్యా! చూశావే వీళ్ళకి పాపం మంచి బట్టలు లేనేలేవు కట్టుకోడానికి!"

"అవునే మధూ! వాళ్ళు బీదవాళ్ళు"

"అయితే మనమూ బీదవాళ్ళమే అన్నాది పెద్దక్కయ్యా?"

"వాళ్ళు మనకంటే బీదవాళ్ళు."

"చూశావే చిన్నక్కయ్యా, ఆమేడమీదనుంచోని ఆవిడ ముష్టివాళ్లని యెలాగ పొమ్మంటున్నాదో? పాపం వాళ్ళు అనుకుంటూవుంటే కోప్పడుతున్నాది కూడానూ!" అని శశిరేఖ ఎదురుగుండా వున్న మేడవేపు చూపిస్తూ అంది. మధుర వెంటనే రెండు పిడికిళ్ళబియ్యం ఆముష్టివాళ్ళకి వేసింది. ఆ మేడమీదావిడ చూచి లోపలికి పోయింది.

ఇంతల్లోకి పదకొండుగంటలైంది లోపల్నుంచి లక్ష్మీదేవి వచ్చి అంది: "పిల్లలారా యేంచేస్తున్నారు?"

"బియ్యం వేస్తున్నాం నేనూ, అక్కయ్యలున్నూ!" అని మధుర చెప్పింది.

"ఇంక అన్నానికి రండి లోపలికి!"

"అమ్మా అప్పుడే వంటయిందే? ఒబ్బట్లు చేశేవు కదూ?" అంది శశిరేఖ.

"చద్దికూడానూ, ఏమే అమ్మా?" అంది రోజ.

"నాకు వొబ్బట్లంటే యిష్టం" అంది మధుర.

ముగ్గురూ లేచి తల్లితో యింట్లోకి వెళ్లేరు. విస్తళ్ళువేసి లక్ష్మి వడ్డించింది పప్పూ, అన్నం, చద్దీ, పచ్చళ్ళున్నూ. నలుగురూ విస్తళ్ళముందు కూర్చున్నారు. ఇంతట్లోకి వీధులోంచి "అమ్మా కడుపు మండిపోతున్నాది. ఇంతఅన్నం పెట్టించండమ్మా!" అని ఒక ఆర్తనాదం వినబడింది వెంటనే లక్ష్మి వీధి గడపలోకి వెళ్ళింది. వెనకాతల పిల్లలు కూడా వెళ్ళేరు. ఇంటి గుమ్మందగ్గిర మాసిన చింకి గుడ్డతో ఒళ్లు కప్పుకున్న ఒక పదేళ్ల మాలపిల్ల నిలబడిఉంది.

"అమ్మగోరండీ, రచ్చించండి మీ పున్నెముంటుంది. తిండిలేదు మాఅమ్మకి, మరింకాపిల్ల లేడుస్తున్నారండీ!" అంటూ యేమేమో చెబుతూ యేడవడం మొదలెట్టింది ఆమాలపిల్ల. బాలికలు నలుగురూ దాని వేపే చూస్తున్నారు. లక్ష్మీదేవి ఈమాలపిల్లని ఊరుకోమని చెప్పి దాని కథ యేమిటో కనుక్కుంది. ఆ మాలపిల్ల తల్లి ఊరువెలపల తోటదగ్గిర పాడైపోతున్న గుడిసెలో జ్వరంతో బాధపడుతూందట. వాళ్ళు నలుగురు పిల్లలుట. తిండిలేక రెండురోజుల్నుంచీ మలమల మాడిపోతున్నారట. వాళ్ళతండ్రి లేడట. ఆమాలపిల్ల ఒకధనవంతుల యింటికి వెళ్ళి ముష్టి అడిగితే, పాపం, దూరంగాపొమ్మని తగిలీసేరట. ఇది విని లక్ష్మి, బాలికలూ మిక్కిలి విచారించేరు. ఆబీదకుటుంబాన్ని రక్షించడానికి వాళ్ళు వెనక తియ్యలేదు.

"పిల్లలారా! చూశారా, మీలాటి పిల్లలే తిండి బట్టలులేక బాధపడుతున్నారట. మీఅన్నం వాళ్ళకి పెడతారా? నాకు చాలాఆనందంగావుంది. సుమా!" అని లక్ష్మిఅంది.

"అమ్మా! అయితే మనం అన్నం అక్కడికి పట్టికెళ్లాలికదే?" అంది శశిరేఖ.

"అవునే తల్లీ! మరిపట్టికెళ్లకపోతే యీ పిల్ల యెలా పట్టికెళ్లి పెడుతుంది?"

'అమ్మా! నేను వొబ్బట్లు పట్టుకొస్తానే!' అని మధుర అంది.

'అమ్మా నేను అన్నం అవీ మూట కడతాను' అంటూ సుభద్ర లోపలికి పోయింది.

'అయితే అమ్మా, వాళ్లకి బట్టలులేవు కదా, యెలాగ?' అని మధుర అంది.

'మీరు మీ కొత్తబట్టలు వాళ్లకి పండుక్కి కట్నం యిస్తారా?'

'అలాగేనేఅమ్మా!' అని శశీ, మధురా, అన్నారు. వెంటనే వాళ్లు పాతబట్టలు తొడుక్కొని కొత్తవి మూటకట్టేరు. ఈ బ్రాహ్మణ కుటుంబం చూపుతున్న ఆదరానికి ఆమాలపిల్ల ఆనందం ఆపుకోలేక పోయింది. పంచమజాతి, అగ్రజాతి, అను భేదభావం ఆకుటుం

బానికి లేనేలేక పోయింది. తమవంటి పిల్లలను తమలాగే చూచుకోవాలని బాలికల వుద్దేశం. మధుర వొబ్బట్లు పట్టుకుంది. శశి బట్టలు పట్టుకుంది. సరోజా, లక్ష్మి అన్నం మొదలైనవి పట్టుకున్నారు: మాలపిల్ల వెంటబైల్దేరేరు. సుభద్ర యింటిదగ్గర ఉండిపోయింది.

11 గంటలు దాటుట వల్ల వీధిలో, ఈవింతను చాలామంది చూడలేదు. చూచినవాళ్లు ఒకరిద్దరు నవ్వుకున్నారు. ఆ వీధి చివరఉండే ఒక తాతగారు కూడా చూచేరు.

అరమైలు దూరంలో ఉన్న ఒకమామిడితోట దగ్గరకు వాళ్లువచ్చేరు. అక్కడ ఒక గుడిసెలోకి వాళ్ళని మాలపిల్ల తీసికెళ్లింది. ఒక కుక్కిమంచంలో పడుక్కొని మూలుగుతూంది మాల తల్లి. పక్కనే మూడేళ్ళపిల్లడు ఏడుస్తున్నాడు. చాపమీద మరిద్దరాడపిల్లలు నీరసంగా శుష్కించి ఉన్నారు.

'అమ్మా, యీ అమ్మగోరు అన్నం, యింకా యేటేటో తెచ్చినారే మనకి పెట్టడానిక్!' అని మాల పిల్ల అంది. మాలది కళ్లుతెరిచింది.

'ఎవురమ్మా! మేం మాలోళ్ళం. మాయింటికెలా గొచ్చినారమ్మా! మమ్మల్ని రచ్చించడాని కొచ్చి నారా? మిమ్మల్ని సూస్తే దేవతల్లా గున్నారు!' అంటూ మాలది ఆశ్చర్యం, సంతోషం, సంభ్రమం, కనపర్చింది. ఆ మాలదానికీ, ఆ పిల్లలకీ, లక్ష్మీదేవి కడుపారా భోజనం కలిగించింది. ఆ పిల్లలు ఆత్మానందంతో ఆవేళ ఆకలితీర్చుకున్నారు. చలితో వణికి పోతూన్న మాలదానికి లక్ష్మీదేవి దుప్పటీ కప్పింది. పిల్లలకి, బట్టలు కొత్తవి, తొడిగించింది. లక్ష్మీదేవి ఉపచారములతో మాలదానికి కొంత బాధతగ్గి నూతన శక్తి వచ్చింది. ఆ తరవాత లక్ష్మీదేవి, పిల్లలూ, మాలదానికి ధైర్యంచెప్పి ఇంటికివచ్చేరు. అప్పుడు వాళ్లందరికీని నిజమైన పండుగ అనిపించింది. ఇంటి దగ్గరఉన్న అన్నమేనో పిల్లలు తిన్నారు. లక్ష్మీదేవికి ఆపూట భోజనంలేదు. ఇటువంటి నిరశనదినములు ఆస్వార్థత్యాగిని ఎన్నిగడపివుంగో!

కొంతసేపటికి ఒక కుర్రవాడు వాళ్లయింటికి వచ్చేడు. ఆకుర్రవాణ్ణి మన బాలికలు ఎరుగుదురు. శశీ, మధురా బరికివెళ్లేటప్పుడు అతడుకూడా వెళ్ళడం కద్దు.

'మాయింట్లో మాతాతయ్య ఈవాళ మిఠాయీ, అవీ చేయించేరు, మధురకీ వాళ్ళకీ యివ్వాలనిఉంది, పంపిస్తామన్నారు' అంటూ ఆబాలుడు లక్ష్మీదేవి అనుజ్ఞకోసం నిలబడ్డాడు. లక్ష్మి, పిల్లలూ, మాల దానియింటికి వెళుతూన్నపుడు చూచిన తాతగారే ఆయన. ఆయనకు మంచిపిల్లలంటే ప్రేమ. భగవ ద్విలాసమునకు లక్ష్మి ఆశ్చర్యపడి, ఆలాగే అంది. కుర్రవాడు వెళ్ళిపోయి, కొంతసేపట్లో, లాడూలు, జిలేబీలు, పకోడీలు మొదలైనవి పట్టించుకొని వచ్చేడు. పిల్లలకు నాడు భోజనం లేదని గ్రహించి అవి తాతగారు పంపించేరు. బాలికల ఆశ్చర్యమూ, ఉత్సాహమూ, ఏమిచెప్పను? వాళ్ల అమ్మచేసిన పిండివంటలకంటె మంచివి లభించేయి.—అని వాళ్లు కడుపునిండా తిన్నారు.

ఆహా! లక్ష్మీదేవి ధన్యురాలు! ఆకుటుంబ జీవితం ధన్యం! ధన్యం!!